సాక్షి
వరంగల్
బుధవారం | 18 | జూన్ | 2025





### ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు

రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా ఉండొద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

- 8లో▸



### తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$35^0$ / $26^0$

### వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రూ.94.16 కోట్ల రైతుభరోసా నిధులు జమ

న్యూశాయంపేట: రైతుభరోసా పథకంలో భాగంగా మంగళవారం సాయంత్రం వరకు రూ.94.16 కోట్లను జిల్లాలోని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి 1,29,542 మంది ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన రైతులకు త్వరలో జమవుతాయని ఆమె తెలిపారు.

**పేర్లు నమోదు చేసుకోవాలి..**

జిల్లాలో కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకున్న రైతులు రైతుభరోసా పథకం కోసం సంబంధిత ఏఈఓకు తమ వివరాలు అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు అందించాలని సూచించారు.

### సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో రంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎస్‌బీ శ్రీనివాసాచారి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, టీజీఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ ఎస్‌ఈ బి.శ్రీనివాస్ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచారి, అర్చకులు శ్రీహర్ష వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అభిషేకం తదితర పూజలు చేయించారు.

### మొగిలిచర్లలో చోరీ

గీసుకొండ: ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బీరువా పగులగొట్టి నగదు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన అచ్చె సమ్మక్క హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు ఈ నెల 9న వెళ్లింది. మంగళవారం ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన పొరుగు వారు విషయాన్ని ఫోన్ చేసి ఆమెకు తెలిపారు. స్థానికులు వచ్చి చూడగా బీరువా తాళం పగులగొట్టి, అందులోని రూ.75 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుని వెళ్లారని గమనించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

### దాడి చేసిన వారిపై కేసు

సంగెం: భూమి గెట్టు విషయంలో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గవిచర్ల గ్రామానికి చెందిన కద్దూరి వెంకటయ్య, తన కుమారుడు సదయ్య, కోడలు రమ 16వ తేదీన మొక్కజొన్న విత్తనం వేస్తున్నారు. భూమి పక్కన ఉన్న రైతు బుట్టి వెంకటేశ్ గెట్టు దాటి తమ భూమిలో విత్తనం వేస్తున్నారని బూతులు తిడుతూ కర్రతో వారిపై దాడి చేశారు. తిరిగి మంగళవారం గ్రామంలో లింగాల నవీన్ రెడ్డి స్థలంలో వెంకటయ్య, అతడి మనుమడు విఘ్నేశ్ పసుపు శుభ్రం చేస్తుండగా వెంకటేశ్ అతడి బావమరిది కర్ర ప్రశాంత్ కర్రతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంకటేశ్, ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వేదపాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి వేదపాఠశాలలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్, దేవాలయ ఈఓ శేషుభారతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వేదపాఠశాలలో ప్రవేశానికి విద్యార్థులకు మాతృభాషలో చదవడం, రాయడం వచ్చి, 8 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉపనయన సంస్కారం, ఉపాకర్మోత్సర్జనం పూర్తయినవారు అర్హులని పేర్కొన్నారు. అలాగే సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞం కంఠస్థమై ఉండి స్వయంగా అనుష్ఠానం చేసుకోగలవారు, 10 సంస్కృత శబ్దములు (7 విభక్తులు) కంఠస్థం అయినవారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వరంగల్‌లోని శ్రీభద్రకాళి దేవస్థానంలోని వేదపాఠశాల కార్యాలయంలో 18వ తేదీ నుంచి దరఖాస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 25వ తేదీవరకు అందజేయాలని కోరారు.

### ఈసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

రామన్నపేట : వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజీఈసెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్, క్యాంపు ఆఫీసర్ బైరి ప్రభాకర్ తెలిపారు. మొదటిరోజు 362 మంది విద్యార్థులు హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. అధికారుల పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ క్రమబద్ధంగా కొనసాగిందని తెలిపారు.

# షరతులు వర్తిస్తాయి!

**నర్సంపేట వైద్యకళాశాలకు యూజీఎంఈబీ పచ్చజెండా**

- ఈ విద్యాసంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు
- చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచన
- నాలుగు నెలల్లోగా అధిగమించకపోతే కఠిన చర్యలని హెచ్చరిస్తూ లేఖ
- ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ముందుకెళ్తామంటున్న ప్రిన్సిపాల్



నర్సంపేటలోని ప్రభుత్వ వైద్యకళాశాల

సాక్షి, వరంగల్: నర్సంపేటలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో 2025–26 సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లను షరతులతో కూడిన మంజూరు చేస్తూ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు (యూజీఎంఈబీ) నిర్ణయించింది. అయితే, ఆధార్ ఎనబుల్డ్ బయోమెట్రికల్ అటెండెన్స్ సిస్టం (ఏఈబీఏఎస్ రికార్డు డాటా) ప్రకారం అన్ని డిపార్ట్‌మెంట్లకు చెందిన ఫ్యాకల్టీ, రెసిడెంట్, ట్యూటర్ కొరతను అధిగమించడం, ఎక్స్‌పైరీ అయిన బ్లడ్ బ్యాంకు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవడం, అదనపు పడకల ఏర్పాటు, శవపరీక్షల కోసం శవాల కొరత ఉండడం వంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ మేరకు నాలుగు నెలల్లోగా సమాధానం ఇవ్వాలని షరతుతో ఈ సీట్లు మంజూరు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌కు ఈ నెల 9వ తేదీన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) పంపిన లేఖలో పేర్కొంది. మీ కళాశాల సమర్పించిన వార్షిక డిక్లరేషన్ రిపోర్టును సంబంధిత విభాగం సమీక్షించింది. అనుభవజ్ఞులు కూడా మీ కళాశాలలో లోపాలు ఉన్నట్లు మరోసారి గుర్తించారు. అయితే, కళాశాల సమర్పించిన సమగ్ర నివేదిక సంతృప్తికరంగా లేదు. ఒకవేళ ఈ నాలుగు నెలల సమయంలో ఆ లోపాలను అధిగమించకపోతే 2023 మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్ మెయింటెనెన్స్ ఆఫ్ స్టాండర్డ్స్ క్లాజ్ 8, చాప్టర్ త్రీ ప్రకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది.

**167 మందికి 102 మంది సిబ్బంది..**

నర్సంపేట ప్రభుత్వ వైద్యకళాశాలలో 27 మంది ప్రొఫెసర్లకు 16 మంది, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు 19 మంది, 58 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు 26 మంది ఉన్నారు. 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు 16 మందికి, 23 మంది సీనియర్ రెసిడెంట్లకు 15 మంది, ఏడుగురు ట్యూటర్స్‌కు నలుగురు, ఆరుగురు హౌస్‌సర్జన్లకు ఆరుగురు ఉన్నారు. మొత్తం 167 మందికి 102 మంది సిబ్బంది ఉన్నాయి. మొత్తం 65 ఖాళీలున్నాయి. అయితే, తాజాగా ఎన్‌ఎంసీ నుంచి ఆదేశాలతో వీటిని భర్తీ చేసే దిశగా కళాశాల ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు.

అదే సమయంలో బోర్డు ఇచ్చిన ఉత్తర్వులతో కళాశాల సంతృప్తి చెందకపోతే ఈ లేఖ అందిన 60 రోజుల్లోపు కమిషన్ ముందు అప్పీల్ చేయవచ్చని సూచించింది. ఇప్పటికే నర్సంపేట వైద్య కళాశాలకు 2025–26 విద్యా సంవత్సరానికి 50 సీట్ల అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే.

**రెండో సంవత్సరం విద్యార్థుల కోసం పరికరాలు..**

నర్సంపేటలోని వైద్యకళాశాల గతేడాది నవంబర్‌లో ప్రారంభమైంది.గత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ ఆగస్టులో పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం మళ్లీ కళాశాల ప్రారంభంలో రెండో సంవత్సరం విద్యార్థులు చదివేందుకు కావాలిసిన పరికరాలతోపాటు ఇతర సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరికరాలు మరో రెండు నెలల్లో కళాశాలకు రానున్నాయి.

**లోపాలను అధిగమిస్తాం..**



ఈ ఏడాది నూతనంగా వచ్చే విద్యార్థులకు 50 ఎంబీబీఎస్ సీట్లను అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు కేటాయించింది. 10 సీట్లు నేషనల్ కోటా, 40 సీట్లు రాష్ట్ర కోటాలో విద్యార్థులను తీసుకోనున్నారు. నూతన భవనంలో ఈ కళాశాల నిర్వహిస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు. యూజీఎంఈబీ గుర్తించిన లోపాలను అధిగమించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం.

– డాక్టర్ మోహన్‌దాస్, నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్

## భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని చెల్లించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్నర్ రింగ్ రోడ్డు, నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆర్‌ఓబీ తదితర అభివృద్ధి పనులపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులను ప్రాధాన్యతతో కొనసాగించాలన్నారు. టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిలో భాగంగా గ్రీన్ కవరింగ్ ఏర్పాటుకు హార్టికల్చర్, ఫారెస్టు అనుసంధాన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. టెక్స్‌టైల్ పార్కులో వరద ముంపు నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని సాంకేతికంగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

**నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి**

భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించడానికి ఉపాధి శాఖ, జీఎం ఇండస్ట్రియల్, డీఆర్‌డీఓ సమన్వయంతో పనిచేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆర్‌ఓబీ పనులను ఆగస్టు చివరి వరకు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జోనల్ మేనేజర్ స్వామి, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, గీసుకొండ, సంగెం, నెక్కొండ, పర్వతగిరి తహసీల్దార్లు, నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణానికి మేస్త్రీలు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వేదికపై కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మేస్త్రీలు సహకరించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కమిటీ సభ్యులు, మేస్త్రీలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3,176 ఇళ్లకు మంజూరు పత్రాలు అందించామని, మరో మూడు వేల ఇళ్లకు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొరం (మట్టి) కోసం లబ్ధిదారులు తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధిక మొత్తంలో ఉపాధి దొరుకుతున్న మేస్త్రీలు ప్రభుత్వం, లబ్ధిదారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వెంటవెంటనే విడతల వారీగా బిల్లులు మంజూరు అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. సదస్సులో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, ఏసీపీ రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్‌తో నాణ్యమైన విద్య

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లతో వర్ధన్నపేటకు కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు స్కూల్ నిర్మాణానికి వర్ధన్నపేట గువ్వలబోడు ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గువ్వలబోడులోని 118 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు, సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్నా ఏ రోజు పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అనువైన స్థలం లేదని దాటవేసి ప్రభుత్వ విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని వివరించారు. స్థానిక దళిత, గిరిజన రైతులు ముందుకు వచ్చి భూములు ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. గువ్వలబోడు ప్రాంతం నిర్మాణాలకు అనువుగా ఉండడంతోపాటు రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభమై, విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గ విద్యాభివృద్ధికి ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఒక మైలురాయిగా నిలుస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

వరంగల్ క్రైం: పోలీస్ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. హనుమకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్‌స్టేషన్లతోపాటు సీసీఎస్,టాస్క్‌ఫోర్స్, యాంటీడ్రగ్స్ విభాగాల్లో బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, రంజిత్, రాఘవేందర్, సత్యనారాయణరెడ్డి, సతీశ్ మంగళవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ వారికి సూచించారు.

## ‘ఆత్మ’ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

- రైతులు, అధికారులు, శాస్త్రవేత్తలకు అవకాశం
- జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు

దుగ్గొండి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మరో ముందడుగు వేస్తోంది. ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. గతంలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఆత్మ కమిటీలు కొన్ని సంవత్సరాలుగా ఆనవాళ్లు లేకుండా పోయాయి. వీటితో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం పెంచేందుకు 2001లో అప్పటి ప్రభుత్వం ఆత్మ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి వ్యవసాయ డివిజన్‌ను బ్లాక్‌గా పరిగణించి రైతులు, అధికారులతో కూడిన సలహా కమిటీని ఏర్పాటు చేసింది. యువజన సంఘాలు, మహిళా మండలి సభ్యులు, ఎరువుల దుకాణాల డీలర్లు తదితరుల భాగస్వామ్యంతో 20 నుంచి 24 మందితో కమిటీ ఏర్పాటు అయ్యేది. కన్వీనర్‌గా ఏడీఏ, మిగిలిన వారు సభ్యులుగా వ్యవహరించేవారు. డివిజన్‌కు ముగ్గురిని తీసుకుని జిల్లా కమిటీ ఏర్పాటు చేసేవారు. రైతులకు ఆధునిక వ్యవసాయంపై సలహాలు, సూచనలు ఇవ్వడం, వ్యవసాయ శిక్షణ శిబిరాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, విజ్ఞాన యాత్రలు నిర్వహించింది. 2019 నుంచి ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో అప్పటి నుంచి ఆత్మ కమిటీలు కనుమరుగయ్యాయి. ఈసారి ప్రభుత్వం మళ్లీ ఆత్మ కమిటీలు ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగులో సలహాలు సూచనలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. త్వరలో కమిటీలు పూర్తిచేసి అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నారు.

**కమిటీల్లో 24 నుంచి 28 మందికి అవకాశం..**

మొదట నియోజకవర్గస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిన అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీల్లో 24 నుంచి 28 మందికి అవకాశం ఉంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రైతులకు ప్రాధాన్యం కల్పిస్తారు. కమిటీల్లో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, సెరికల్చర్, విత్తన డీలర్లు, శాస్త్రవేత్తలకు చోటు కల్పిస్తారు. వ్యవసాయ శాఖ అధికారులు కమిటీలపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

**ఆత్మ కమిటీల లక్ష్యాలు..**

- పంటల సాగులో రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం.
- రైతులకు శిక్షణ, మార్గదర్శకత్వం ఇవ్వడం.
- వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం.
- రైతుల ఆదాయాన్ని పెంచి జీవన ప్రమాణాలు మెరుగుపరచడం.

**ఆదేశాలు రాగానే కమిటీలు ఏర్పాటు చేస్తాం..**



ఆత్మ కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. కమిటీలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. 28 మంది సభ్యులతో మొదట నియోజకవర్గ కమిటీలు, ఆ తర్వాత జిల్లా కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే కమిటీలు ఏర్పాటు చేస్తాం. నూతనంగా ఏర్పాటయ్యే కమిటీలు రైతులకు సాగులో మెళకువలు, సాంకేతిక వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణపై నిరంతరం సలహాలు ఇస్తాయి.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి

# మొక్కుబడిగా బడిబాట

**విద్యార్థుల నమోదు లక్ష్యం నెరవేరేనా!**

- ప్రభుత్వ స్కూళ్లపై గురుకులాల ప్రభావం
- జిల్లాలో 3,896 మంది విద్యార్థుల నమోదు



విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నా తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఇటీవల నిర్వహించిన బడిబాటలో పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యే ఇందుకు ఉదాహరణ. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఈనెల 19వ తేదీతో (గురువారం) ముగియనుంది. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలతోపాటు వివిధ అంశాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. బడిబాటలో భాగంగా ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించడం వారి పేర్లు నమోదు చేసుకోవడం వంటివి చేసి పాఠశాలల్లో చేర్పించాలనే ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతున్నాయి. బడిబాట ముగింపు దశకు వచ్చినా అనుకున్న మేర విద్యార్థులు ప్రభు త్వ పాఠశాలల్లో చేరడం లేదనేది స్పష్టమవుతోంది. అసలు విద్యార్థులు లేని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోటికి సర్దుబాటు తప్పదని భావిస్తున్నారు.

**గురుకుల పాఠశాలల ప్రభావం..**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం బడిబాట నిర్వహించినా గురుకులాల్లోనే ఎక్కువగా విద్యార్థులు చేరుతున్నారనేది స్పష్టమవుతోంది. తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు కూడా అందుబాటులో ఉండటంతో అందులో చేర్పిస్తున్నారు. మరికొందరు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆకర్షణీయమైన ప్రకటనలతో అటువైపు కూడా వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ప్రభుత్వ ప్రా థమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించారు. హనుమకొండలో 16, వరంగల్‌లో 13 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఏ మేరకు ప్రవేశాలు పొందుతారనేది వేచి చూడాల్సిందే.

**అనుకున్నస్థాయిలో నమోదుకాని విద్యార్థులు**

జిల్లా వ్యాప్తంగా మంగళవారం వరకు 3,896 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అనుకున్న మేర విద్యార్థుల నమోదు ప్రక్రియ కావడం లేదనేది స్పష్టమవుతోంది. జిల్లాలో ప్రైమరీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు 568 ఉండగా అందులో అసలు విద్యార్థులే లేని పాఠశాలలు 135 ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం నాలు గు పాఠశాలలే తెరుచుకున్నాయి. అసలే విద్యార్థులు లేని పాఠశాలల టీచర్లను విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు.

## మారని ‘తూర్పు’ పోలీసుల తీరు

- మరోసారి వివాదంలో వరంగల్ ఖాకీలు



సాక్షి, వరంగల్: వరంగల్ డివిజన్ పోలీసుల తీరు మారడం లేదు.. తరచూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. తమ స్టేషన్ పరిధితోపాటు హద్దులు దాటి మరీ వరంగల్ తూర్పులోని ముఖ్య నేతకు బందోబస్తుగా వెళ్లడంపై దుమారం రేపుతోంది. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆలయానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి ఎస్కార్ట్‌గా వ్యవహరించిన మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ తరహాలోనే ఇటీవల వరంగల్ తూర్పులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కొండా మురళికి పోలీసుస్టేషన్‌లో తమ విధులు వదిలి బందోబస్తుగా వెళ్లిన వరంగల్ డివిజన్‌లోని ఏసీపీ, సీఐ, ఎస్సైల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడాన్ని సీరియస్‌గా తీసుకున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వివరణ ఇవ్వాలంటూ మూడు రోజుల క్రితం మెమో జారీచేయడం ఖాకీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మీపై ఎందుకు చర్య తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని, లేకపోతే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై ఆయా పోలీసు అధికారులు సీపీకి వివరణ ఇచ్చారు. వారిచ్చిన వివరణ ఆధారంగానే తదుపరి చర్యలుంటాయని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలోనూ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఏసీపీ పాల్గొనడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.

## నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



పీపీఈ కిట్ అందిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నగరవాసులకు మెరుగైన సేవలు అందించాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మేయర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు తమతమ విభాగాల పనితీరును వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల మరమ్మతులు పక్కాగా చేపట్టాలని మేయర్, కమిషనర్ ఆదేశించారు. అనంతరం సఫాయిమిత్ర కార్మికులకు పీపీఈ కిట్లను వారు పంపిణీ చేశారు.

## క్లుప్తంగా

### తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



ఖిలా వరంగల్: తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 23 నుంచి జూలై 01వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకేజీ -1 (గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర–ఎస్‌సీజెడ్ బీజీ 44) యాత్రలో కాశీ (వారణాసి), అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించొచ్చు. ఈయాత్ర జూన్ 23వ తేదీన ప్రారంభమై జూలై 01వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొక్కరికి సాధారణ టికెట్ ధర రూ.16,200, థర్డ్ ఏసీ ధర రూ. 26,500, 2 ఏసీ ధర రూ. 35,000 ఉంటుంది. యాత్ర రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా వెళ్తుంది. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిళ్లు, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శించొచ్చు. అదనపు ఖర్చులు ఏమి ఉండవు. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయి.అలాగే, రైల్వే స్టేషన్ నుంచి దేవాలయం వరకు ప్రయాణం పూర్తిగా ఉచితం. టికెట్ బుక్ చేసుకోవాలనుకునే వారు వివరాలకు 9701360701 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### బైక్‌ను ఢీకొన్న బొలెరో

- మహిళ మృతి, ఇద్దరికి గాయాలు
- పాలకుర్తిలో ఘటన



చైతన్య మృతదేహం

పాలకుర్తి టౌన్: బైక్ (టీవీ ఎక్సెల్)ను బొలెరో ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన పండుగ చైతన్య(36) తనకున్న భూమిలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం మామ సోమయ్య, కూతురు ప్రవళికతో కలిసి బైక్‌పై పాలకుర్తి మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి బొలెరో ఢీకొనడంతో చైతన్య అక్కడికక్కడే మృతి చెందింది. సోమయ్య, ప్రవళికకు గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, 2005లో చైతన్య భర్త కుమార్ ట్రాక్టర్ యాక్సిడెంట్‌లో మృతి చెందాడు.



# ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం ఓకే

**కేయూ పాలకమండలి సమావేశంలో ఆమోదం**

- ఇప్పుడే పదోన్నతులకు మాత్రం నో..
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 15 ఎకరాలు కేటాయింపు
- ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్ ఎత్తివేతకు ససేమిరా



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (సర్కారు) తీసుకున్న సానుకూల నిర్ణయంపై కేయూ పాలకమండలి సమావేశం చర్చించి ఆమోదించింది. దీంతో ఎట్టకేలకు ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఊరట లభించింది. ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఈఏడాది ఫిబ్రవరి 24న అప్పటి సీఎస్‌ను ఆదేశించిన విషయం విధితమే. దీంతో ప్రభుత్వం ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై సానుకూల నిర్ణయం తీసుకుని ఈఏడాది మే 8న ఆ జీఓను కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పంపింది. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఆ జీఓపై చర్చించి ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాన్ని ఆమోదించారు. కాగా, 15 సంవత్సరాలుగా ఉద్యోగంలో కొనసాగుతున్నా వీరి నియామకంపై వివాదాల నేపథ్యంలో వీరికి క్యాస్ పదోన్నతులు కల్పించలేదు. అయితే వీరికి పదోన్నతులు చర్చకు రాగా ఇప్పుడే కల్పించొద్దని నిర్ణయించారని తెలిసింది. దీంతో వీరు పదోన్నతుల కోసం కొంతకాలం వేచిచూడకతప్పదు.

**యంగ్ఇండియా స్కూల్ కేయూ భూమిలోనే..**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 200కోట్లతో నిర్మాణం చేయాల్సింటుంది. అయితే ఈ నియోజకవర్గంలో ఒకే చోట ప్రభుత్వం భూమి 15 నుంచి 20 ఎకరాల వరకు లభించే పరిస్థితి లేదని సమాచారం. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూలో 15 ఎకరాల భూమి కేటాయించే అంశంపై కూడా యూనివర్సిటీ అధికారులు ఏజెండాలో పెట్టగా చర్చించి పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

**స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి ఓకే..**

జూలై 7న కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం నిర్వహించబోతున్నారు.అయితే విద్యార్థులకు ఇచ్చే గోల్డ్ మెడల్స్‌పై తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలిలో కూడా చర్చ జరిగింది. గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థులు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతం గోల్డ్‌ధర పెరిగినా మెడల్స్ ప్రదానం చేయాల్సిందే. అందుకయ్యే వ్యయానికి తొలుత ఫైనాన్స్ కమిటీలో, ఆ తర్వాత పాలకమండలి సమావేశంలో ఆమోదం లభించింది. స్నాతకోత్సవానికి గవర్నర్ కూడా రానున్నారు. దీంతో స్నాతకోత్సవ నిర్వహణ వ్యయానికి సంబంధించి అంశం ఓకే అయ్యింది.

**రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకంపై చర్చ..**

కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్న పోస్టులను మినహాయించి మిగితా అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల వెకెన్సీల్లో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకం చేపట్టాలనే అంశం కూడా పాలకమండలి సమావేశంలో చర్చించారని సమాచారం. అందుకు పాలకమండలి ఓకే చెప్పినట్లు సమాచారం.

**ఆ ఇద్దరి సస్పెన్షన్ ఎత్తివేతకు నో..**

కేయూ భూమిలో ఓ సర్వే నంబర్‌లో ఇల్లు కలిగి ఉన్నారని, ఇంకా పలు ఆరోపణలతో కొన్నినెలల క్రితం సస్పెన్షన్‌కు గురైన ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఎత్తివేత అంశం చర్చకు వచ్చింది. అయితే అతను ఇప్పటికే కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ ఎత్తివేతకు పాలకమండలి సమావేశం నో చెప్పింది. మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంవత్సరం న్నర క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.అతడిని అప్పట్లోనే యూనివర్సిటీ అధికారులు సస్పెన్షన్ చేశారు. అతడి సస్పెన్షన్ ఎత్తివేతపై పాలకమండలిలో చర్చకురాగా సస్పెన్షన్ ఎత్తివేతకు నో చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఇద్దరికి ఇప్పట్లో ఊరట లభించే అవకాశం కనిపించడం లేదు. ఈ పాలకమండలి సమావేశంలో కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, ఉన్నత విద్యాకమిషనర్ శ్రీదేవసేన, ఫైనాన్స్‌జాయింట్ సెక్రటరీ సుజాత, కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, కేయూ పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేశ్‌లాల్, డాక్టర్ కె. అనితారెడ్డి, పుల్లూరు సుధాకర్, సుకుమారి, ఎం. నవీన్, డాక్టర్ రమ, డాక్టర్ ఎస్ సుదర్శన్, డాక్టర్ చిర్ర రాజు, బాలుచౌహాన్ పాల్గొన్నారు.

# ఇల్లు లేని కుటుంబం ఉండొద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ ఎంపీ కడియం కావ్య



ప్రజాసభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**సంక్షేమంలో వెనుకంజ వేసేది లేదు**

- రైతుల కోసం ఏటా రూ. 70 వేల కోట్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు
- ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లి : రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా, ఆదాయం లేకుండా ఇబ్బంది పడకుండా చూడడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం చెన్నాపూర్‌లో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, కుందూరుపల్లి వద్ద సెంట్రల్ లైటింగ్ పనులను డిప్యూటీ సీఎం మంగళవారం ప్రారంభించారు. అనంతరం మంజూర్‌నగర్‌లో మంజూర్‌నగర్, గణపురం మండలం ధర్మారావుపేట, చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజాసభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన వారు ప్రతీ రూపాయి దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, జీవన ప్రమాణాలు పెరగలేదన్నారు. రైతుల సంక్షేమం కోసం ఏటా ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ఐదేళ్ల కాలంలో రూ. 3.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పథకానికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ. 16 వేల కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లించిందన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య నందించేందుకు మొదటి దశలో 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ. 11,500 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరిక మేరకు జిల్లాలోని కొత్త మండలాల్లో ఎన్పీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్‌లు, జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ స్టోర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, దుబ్బపల్లి, పరశురాంపల్లి గ్రామాల్లో భూసేకరణ చేపట్టాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు సూచించారు. అనంతరం భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ -2ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి సింగరేణి ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**రైల్వే లైన్ తీసుకొస్తా..**

సింగరేణి, కేటీపీపీ పరిశ్రమలు ఉన్న భూపాలపల్లికి రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఇక్కడ జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

**పది రోజుల్లో టాస్క్ సెంటర్..**

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పది రోజుల్లో భూపాలపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి జిల్లాకు చుక్క నీరు రాలేదని, అయినా అప్పటి భూపాలపల్లి ప్రజాప్రతినిధి, మంథని బీఆర్‌ఎస్ నాయకుడు నోరు మూసుకుని ఉన్నారన్నారు. భూపాలపల్లి జిల్లాలో 47,200 ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

**800 మెగావాట్ల ప్లాంటు మంజూరు చేయాలి**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో భూపాలపల్లిలో 500, 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించారని, ఇక్కడ బొగ్గు, నీరు పుష్కలంగా ఉన్నాయని, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. సింగరేణి, కేటీపీపీలో స్థానికులు, భూ నిర్వాసితులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో సింగరేణి సీఎండీ బలరాంనాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎన్పీడీసీఎల్ సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ మల్హూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



### పత్తి రైతు అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాటన్ అసోసియేషన్ బాధ్యులు

న్యూశాయంపేట: తెలంగాణలో పత్తి రైతు అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాటన్ కార్పొరేషన్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్‌కుమార్ గుప్తా, సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయసేనా, సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీపాణిగ్రహి తదితరులను ముంబాయిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం నుంచి 40లక్షల బేళ్ల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసి రైతులకు మూడురోజుల్లో డబ్బులు చెల్లించిన నేపథ్యంలో చైర్మన్, తదితరులను సన్మానించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

### సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కేయూ క్యాంపస్: టీజీఈసెట్ అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌ఎం రెహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రికి పరామర్శ



సత్యవతి రాథోడ్‌ను పరామర్శిస్తున్న మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ

మహబూబాబాద్/కురవి: ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని తన నివాసంలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు.

# కంచ కట్టయ్య జీవితం ఆదర్శం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కంచ కట్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నర్సంపేట: మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం నింపిన కంచ కట్టయ్య (సైన్స్ మనిషి..బిరుదు) జీవితం ఆదర్శమని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన ప్రొఫెసర్ కంచ ఐలయ్య సోదరుడు, సైన్స్ శాస్త్రవేత్త కంచ కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కంచ కట్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలు వీడి కంచ కట్టయ్య జీవితాన్ని ఆదర్శం తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ వీరన్నయాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాశ్, కంపాటి వీరయ్య, ఓయూ జేఏసీ నాయకులు కొంగళపాండు కురుమ, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాడి రమేశ్, వెంకట్‌నాయక్, మేకల శివ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో నియోజకవర్గ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, రైతు భరోసా వంటి పథకాల అమలుపై మంత్రి ప్రభాకర్ చర్చించారు.

# బీపీఈడీలో రైతుబిడ్డకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

- క్రీడల్లో ప్రతిభ కనబర్చిన జ్యోతిర్మయి
- తల్లిదండ్రులు, గ్రామస్తుల హర్షం



జ్యోతిర్మయి

ఏటూరునాగారం: బీపీఈడీలో రైతుబిడ్డ సత్తా చాటింది. టీజీ పీఈసీఈటీ–2025 ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రొయ్యూరుకు చెందిన రైతు రామయ్య, కుమారి దంపతుల కూతురు జ్యోతిర్మయి ఈ నెల 13వ తేదీన టీజీ పీఈసీఈటీ–2025 (తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) రాసింది. ఈ క్రమంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో తల్లిదండ్రులు రామయ్య, కుమారి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, జ్యోతిర్మయి రొయ్యూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ 5వ తరగతిలో రాయపర్తి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సీటు సాధించింది. ఐదు నుంచి ఇంటర్ వరకు అక్కడే చదువుకుంది. అయితే క్రీడలపై మక్కువతో 9వ తరగతిలో రంగారెడ్డి జిల్లా కమ్మదను సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ అకాడమీలో కోచ్ హబీబ్ హుస్సేన్ వద్ద శిక్షణ తీసుకుంది. అనంతరం పాలమూరు యూనివర్సిటీ డిగ్రీ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల బీపీఈడీ (వ్యాయామ) ప్రవేశ పరీక్ష రాసింది. ఇందులో స్టేట్ ర్యాంక్‌ను సాధించింది. కాగా, బీపీఈడీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు సంతోషంగా ఉందని జ్యోతిర్మయి తెలిపింది.

# నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు బాలకార్మికుడు బలి..

- నిద్రిస్తున్న బాలుడిపై నుంచి వెళ్లిన బోరువాహనం
- అక్కడికక్కడే మృతి.. మిర్యాలపెంట సమీపంలో ఘటన



హిడ్మా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

బయ్యారం: నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ బాలకార్మికుడిని బలి తీసుకుంది. బాలుడిని పనిలో పెట్టుకోవడమే నేరం కాగా అలసిపోయి నిద్రిస్తున్న ఆ చిన్నారిపై నుంచి బోరువాహనం వెళ్లడంతో నిద్రలోనే అనంత లోకాలకు వెళ్లాడు. ఈ హృదయవిధారకర ఘటన మంగళవారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామానికి చెందిన ధారావత్ భాస్కర్ బోరువాహనంపై పని చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా నీలవరం గ్రామానికి చెందిన కబాతి హిడ్మా(14) పదిరోజుల క్రితం మేనమామ సుక్కతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో బయ్యారం మండలంలోని మిర్యాలపెంట సమీపంలో బోరువేస్తుండగా హిడ్మా ఆ వాహనం కింద నిద్రపోయాడు. ఇది గమనించకుండా వాహన డ్రైవర్ భూక్య భాస్కర్ వెనకకు తిప్పడంతో హిడ్మా తలపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ సుక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

# మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

- ఇస్రా తండాలో ఘటన



రంగమ్మ మృతదేహం

నెల్లికుదురు: మద్యం మత్తులో భర్త క్షణికావేశంలో భార్యను హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం హేమ్లాతండా శివారు ఇస్రా తండాలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం. తండాకు చెందిన బానోత్ భద్రు, రంగమ్మ (55) దంపతులు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న భద్రు క్షణికావేశంలో రంగమ్మను గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం క్షణికావేశంలో తానే హత్య చేశానని తండావాసుల ముందు ఒప్పుకున్నాడు. ఈ ఘటనపై మృతురాలి కూతురు వాంకుడోతు శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలి

- తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని
- వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ సందర్శన



వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో నర్సింగ్ సైలాని

కాజీపేట రూరల్/మామునూరు/విద్యారణ్యపురి : దేశ రక్షణ కోసం యువతను సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సైలానికి వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ నింబాకర్ వీరచక్ర స్వాగతం పలికారు. రెండు రాష్ట్రాల బాధ్యతలు చేపట్టిన నర్సింగ్ సైలాని గ్రూప్‌హెడ్‌క్వార్టర్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎన్‌సీసీ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశ రక్షణ రక్షణ కోసం యువత సైన్యంలో పాల్గొనేలా సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రూప్ శిక్షణ విధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ పద్ధతులు, క్యాంప్ నిర్వహణ, పరిపాలన విధానాలు చూసి అభినందించారు. ఎక్సైజ్‌కాలనీలోని ఆర్మీ మెస్‌కు వెళ్లి అక్కడ జవాన్లతో కలిసి భోజనం చేశారు. అనంతరం 10వ తెలంగాణ బెటాలియన్, 1వ తెలంగాణ బెటాలియన్, 4వ ఎయిర్ ఫోర్స్ బెటాలియన్, మామునూరు పీటీసీ క్యాంప్‌ను సందర్శించారు. కాగా, నర్సింగ్ సైలాని బుధవారం ఖమ్మం బెటాలియన్‌ను సందర్శిస్తారని గ్రూప్ కమాండర్ సచిన్ నింబాకర్ తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు రాహుల్ సింగ్, ఎస్ఎం. రియాజ్, కల్నల్ పిప్పి కిశోర్, కల్నల్ ఎస్.ఎస్.రామదుర్గై, విజయ్‌కుమార్, 'టి' వింగ్ కమాండర్ ఆశీష్ భాస్కర్, 'డి' వింగ్ కమాండర్ వి.కె.ఆర్య, కల్నల్ రవీంద్రకుమార్, లెఫ్టినెంట్ రవి సునారి, కల్నల్ సంజయ్‌కుమార్, కల్నల్ నవీన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌సీసీలో రాణిస్తే భవిష్యత్..**

క్రమశిక్షణ, సామాజిక సేవభావంతో ఎన్‌సీసీలో రాణిస్తే క్యాడెట్‌కు భవిష్యత్ ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ నర్సింగ్ సైలాని అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం పదోరోజుకు చేరుకుంది. క్యాడెట్లకు బ్యాలెన్స్ జంప్, వాల్‌జంప్, రన్నింగ్, డ్రిల్, మాప్‌రీడింగ్,ఫైరింగ్, ఆయుధ శిక్షణ ఇచ్చారు. నర్సింగ్ సైలాని ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమావేశంలో 8వ బెటాలియన్ కమొడర్ కల్నల్ రవీంద్రకుమార్, 615మంది క్యాడెట్లు పాల్గొన్నారు.